క్లుప్తంగా

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

మెట్‌పల్లి: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, నాయకులు మారుతి, రామగిరి రమేశ్, పడాల నర్సయ్య, పెద్ద లింబయ్య, దిలీప్ తదితరులున్నారు.

హుండీల లెక్కింపు

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస శ్రీ పౌలస్తేశ్వరస్వామి ఆలయం, పట్టణంలోని శ్రీ శ్రీనివాస ఆంజనేయ భవాని శంకర ఆలయ హుండీల లెక్కింపు మంగళవారం జగిత్యాల డివిజన్ దేవాదాయ పర్యవేక్షణ అధికారి రవికిషన్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయ ఈవో వేణుగోపాల్ తెలిపారు. పొలాస పౌలస్తేశ్వరస్వామి ఆలయానికి రూ.1,00,055 రాగా, శ్రీనివాస ఆంజనేయ భవాని శంకర దేవాలయంలో రూ.2,16,823 సమకూరినట్లు ఈవో పేర్కొన్నారు.

ఎంపీపీని కలిసిన హెచ్ఎం



ఎంపీపీని సన్మానిస్తున్న హెచ్ఎం రమేశ్

రాయికల్: తాట్లవాయి హైస్కూల్ హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరించిన బోగ రమేశ్ మంగళవారం ఎంపీపీ లావుడ్య సంధ్యారాణిని మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న వెలమ నాయకులు

రాయికల్: తన యూట్యూబ్ చానల్‌లో వెలమ కులాన్ని కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని వెలమ సంక్షేమ సంఘం రామాజీపేట సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం రాయికల్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. సంఘం అధ్యక్షుడు దుగ్యాల రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి జకిలేటి హరీశ్‌రావు, ఉపాధ్యక్షుడు వినోద్‌రావు, కోశాధికారి శ్రీనివాస్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

రుణమాఫీ చెక్కుల పంపిణీ



చెక్కులు అందించిన చైర్మన్ మాధవరావు

గొల్లపల్లి: మండలంలోని చందోలి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని 62 మంది రైతులకు రూ.21.16 లక్షల విలువైన రుణమాఫీ చెక్కులను సింగిల్‌విండో చైర్మన్ గందె మాధవరావు మంగళవారం పంపిణీ చేశారు. డైరెక్టర్లు అలిశెట్టి రవి, నక్క కొముర‌య్య, ముస్కు రాంరెడ్డి, వెంకయ్య, లక్ష్మయ్య, సీఈవో హఫీజ్ పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన



సూచనలిస్తున్న కమిషనర్ అనిల్‌బాబు

జగిత్యాలటౌన్: పట్టణంలో గణేశ్ నిమజ్జనం జరగనున్న చింతకుంట చెరువు వద్ద ఏర్పాట్లను జగిత్యాల బల్దియా కమిషనర్ అనిల్‌బాబు మంగళవారం పరిశీలించారు. చెరువులో నాచు తొలగింపు, తెప్ప, క్రేన్, లైటింగ్ ఏర్పాటుతోపాటు బుధ, గురువారాల్లో నిమజ్జనం సాఫీగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బల్దియా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కౌన్సిలర్లు దుర్గయ్య, నక్క జీవన్, మాజీ కౌన్సిలర్లు గాజుల రాజేందర్, మన్సూర్ తదితరులున్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

పెగడపల్లి: గణేశుడి నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై సీహెచ్ సతీశ్ నిర్వాహకులకు సూచించారు. పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడారు. శోభాయాత్రలో గొడవలకు దిగితే కేసులు నమోదు చేస్తామన్నారు. డీజేలకు అనుమతి లేదని, అనుమతి లేకుండా డీజేలు పెడితే కేసులు నమోదు చేయడంతో పాటు సీజ్ చేస్తామని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఎస్సై కోరారు.

ఐలమ్మ తెగువ స్ఫూర్తిదాయకం







చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కోరుట్ల: ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, నాయకులు



నివాళి అర్పిస్తున్న శ్రావణి



రాయికల్: మున్సిపల్ చైర్మన్ హన్మాండ్లు..



వర్షకొండలో బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్..

జగిత్యాలటౌన్: వీరనారి చాకలి ఐలమ్మ తెగువ భావితరాలకు స్ఫూర్తిదాయకమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా మంగళవారం జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు మినీ ట్యాంక్ బండ్ వద్ద గల ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. బల్దియా చైర్‌పర్సన్ గోలి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు, కౌన్సిలర్లు ఉన్నారు. ఐలమ్మ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, రాష్ట్ర నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి నివాళి అర్పించారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సన్మానం

మంగళవారం నిజామాబాద్ పార్లమెంట్ పదాధికారుల సమావేశానికి భోగ శ్రావణి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా వచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆమె శాలువా కప్పి, సత్కరించారు.

కోరుట్ల: పట్టణంలో చాకలి ఐలమ్మ జయంతిని రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద గల ఆమె ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు నివాళి అర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, వైస్ చైర్మన్ పవన్, కమిషనర్ రాజేశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అనిల్, రజక సంఘ నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు నివాళి అర్పించారు. వైస్ చైర్‌పర్సన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు మహేశ్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, మైతాపూర్ సర్పంచ్ అజారుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలో ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం నాయకులు నివాళి అర్పించారు. సత్తయ్య, మల్లేశం, సాయి తదితరులున్నారు.

మెట్‌పల్లిరూరల్: ఆత్మనగర్‌లో ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పించారు. సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ విజయ్, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: వర్షకొండలో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పించారు. బీఆర్ఎస్ కోరుట్ల అభ్యర్థి సంజయ్, నాయకులున్నారు.

కథలాపూర్: చింతకుంట, కథలాపూర్‌లలో రజక సంఘం నాయకులు ఐలమ్మ జయంతి నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేశారు.

గొల్లపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చాకలి అయిలమ్మ జయంతి నిర్వహించారు. నాయకులు మహిపాల్, తిరుపతి, బన్నీ, సంజయ్ పాల్గొన్నారు.

మల్యాల: చాకలి ఐలమ్మ పోరాటాన్ని నేటి మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని సర్పంచ్‌ల ఫోరం మల్యాల మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్ అన్నారు. మంగళవారం ఐలమ్మ జయంతిని సందర్భంగా మండల కేంద్రంలోని బ్లాక్ ఆఫీస్ సమీపంలోని ఆమె విగ్రహానికి ఎంపీపీ మిట్టపల్లి విమల, రజక సంఘం నాయకులు నివాళి అర్పించారు.

మెట్‌పల్లి: పట్టణంలో ఐలమ్మ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పలువురు నాయకులు నివాళి అర్పించారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో చాకలి ఐలమ్మ జయంతిని రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం సారంగాపూర్ మండలశాఖ అధ్యక్షుడు మత్రిపల్లి రమేశ్, సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, గౌరవ అధ్యక్షుడు కొదురుపాక లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్: మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో గల చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పించారు. కేక్ కట్ చేశారు. రజక సంఘం మండల అధ్యక్షుడు మల్యాల కుమార్, సర్పంచ్ మురళి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదల పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్



కల్యాణలక్ష్మి చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలరూరల్: నిరుపేద ఆడబిడ్డల పెళ్లికి కల్యాణలక్ష్మి పథకం ఎంతగానో దోహదపడుతోందని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. మంగళవారం జగిత్యాల అర్బన్ మండలంలోని తిప్పన్నపేటకు చెందిన ఏనుగుల మల్లీశ్వరికి పథకం చెక్కును అందజేశారు. సీఎం కేసీఆర్ నిరుపేదల పక్షపాతి అని, వారి సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని తెలిపారు. ఆడబిడ్డల పెళ్లి తల్లిదండ్రులకు భారం కాకూడదని కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

నా కుమారుడిని ఆశీర్వదించండి

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల రూరల్: రాబోయే ఎన్నికల్లో నా కుమారుడు సంజయ్‌ని గెలిపించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. కోరుట్ల పట్టణ శివారులోని ఓ గార్డెన్, మోహన్‌రావుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం 9 గ్రామాల పింఛన్ లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేశారు. 20 ఏళ్లుగా నియోజకవర్గానికి సేవ చేస్తున్నానని, అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. ఆరోగ్య కారణాల రీత్యా ఈసారి తాను ఎమ్మెల్యేగా పోటీ చేయటం లేదన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలనే ఉద్దేశంతో తన కుమారుడిని బరిలో దించుతున్నానని పేర్కొన్నారు. ప్రజలు రెండేళ్ల కరోనాతో బాధ పడినప్పుడు కనిపించని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎన్నికలు వస్తున్న తరుణంలో గ్రామాల్లో తిరుగుతున్నారని విమర్శించారు. ఎవరు సేవ చేశారో ఆలోచించి, వారికే ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్, ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు దారిశెట్టి రాజేశ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు, వైస్ ఎంపీపీ స్వరూప, సర్పంచ్‌ల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సింగిల్‌విండో చైర్మన్లు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల అభ్యర్థి సంజయ్‌కి మద్దతు



ప్రతిజ్ఞ చేస్తున్న అంబేడ్కర్ సంఘం సభ్యులు

కోరుట్ల రూరల్: మండలంలోని మాదాపూర్‌కు చెందిన అంబేడ్కర్ మాదిగ సంఘం, బీఎస్‌పీ యూత్ సభ్యులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌కి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామానికి వచ్చిన సంజయ్‌కి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. సంఘం భవనం అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు. అంతకముందు చాకలి ఐలమ్మ, అంబేడ్కర్ విగ్రహాలకు జెడ్పీటీసీ సభ్యురాలు దారిశెట్టి లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్ పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఆదిరెడ్డి, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఆఫీస్‌లో సమయపాలన ఏది?



మధ్యాహ్నం 12 గంటలకు ఖాళీగా కుర్చీలు

వెల్గటూర్: ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన వెల్గటూర్ మండల తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. నాయబ్ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్ వంటివారు లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఉన్న సిబ్బంది కూడా సమయానికి ఆఫీస్‌కు రాకపోవడంతో పనుల నిమిత్తం వివిధ గ్రామాల నుంచి వచ్చేవారికి నిరీక్షణ తప్పడం లేదు. గిర్దావర్ ఒక్కరోజూ మధ్యాహ్నం 12 గంటల్లోపు కార్యాలయానికి రావడం లేదు. ఒక్కోసారి మధ్యాహ్నం 2 గంటల తర్వాత వస్తున్నారు. మిస్సింగ్ సర్వే నంబర్ కోసం దరఖాస్తు చేసి, మూడు నెలలు గడిచినా ఇప్పటివరకు గిర్దావర్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టలేదని ఓ అర్జీదారు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సమయపాలన పాటించక నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కంటి వైద్యశిబిరాలు వినియోగించుకోండి

మల్లాపూర్: కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్ అన్నారు. మంగళవారం మండలంలోని పాత దాంరాజుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో కంటి వైద్యశిబిరాల కరపత్రాలను రీజనల్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఈనెల 29న రేకుర్తి కంటి ఆస్పత్రి సహకారంతో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్పంచ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గంగాధర్, సీనియర్ నాయకులు సుతారి రాజేందర్, ప్రతాప్, కట్కం శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ కార్యదర్శి తోట రాజరెడ్డి, సభ్యులు సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం



వెల్గటూర్: గొల్లపల్లి మండలంలోని లొత్తునూర్‌కు చెందిన బోడకుంటి శ్రీనివాస్–లాస్య దంపతుల కుమారుడు అయాన్ష్ జన్యు సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నాడు. చికిత్సకు రూ.25 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పెరిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బాలముకుందం బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి, రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. సంగంపల్లి సర్పంచ్ అంకతి మల్లయ్య రూ.5 వేలు, బీరుసాని సర్పంచ్ భర్త కారుకూరి సత్తయ్య రూ.2,500 అందజేశారు. దాతలు స్పందించి, సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో చిరుత రాజన్న, సంగ సత్తన్న, చిరుత వెంకటేశ్, సింగిల్‌విండో డైరెక్టర్ రాందేని కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల దినోత్సవం



ఫార్మసిస్ట్ ఉదయ్‌ను సన్మానిస్తున్న వైద్యులు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఫార్మసిస్టుల దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఫార్మసిస్ట్ ఉదయ్‌ను శాలువాతో సత్కరించారు. ఫార్మసిస్టుల సేవలు అభినందనీయమని వైద్యులు పేర్కొన్నారు. అనంతరం పేషెంట్లకు స్వీట్లు పంపిణీ చేశారు. వైద్యాధికారి ఉదయ్, సీహెచ్‌వో విజయ్, పీహెచ్ఎన్ హేమలత, సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల పనులకు భూమిపూజ

కథలాపూర్: పోసానిపేట, గంభీర్‌పూర్ గ్రామాల్లో హైమాస్ట్ లైట్ల పనులకు మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. కథలాపూర్‌లో గుంటు పెరమాండ్ల స్వామి దేవాలయ అభివృద్ధికి మంజూరైన రూ.10 లక్షల ప్రొసీడింగ్ కాపీని గ్రామస్తులకు అందించారు. ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ సభ్యుడు నాగం భూమయ్య, ఎంపీటీసీ సభ్యుడు మల్యాల రమేశ్, సర్పంచ్‌లు గంగారెడ్డి, సింధూజ తదితరులు పాల్గొన్నారు.

బోనాలతో 'మధ్యాహ్న' కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

మెట్‌పల్లి: సమ్మెలో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం బోనాలతో నిరసన తెలిపారు. జాతీయ రహదారిపై ర్యాలీ చేపట్టారు. పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే నిత్యావసర సరుకులు, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, సహాయ కార్యదర్శి ఉస్మాన్, సంగీత, సరస్వతి, సులోచన, గంగు తదితరులున్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



వెల్గటూర్‌లో 108 రకాల నైవేద్యాలు



చింతకుంటలో పూజలు చేస్తున్న బాపురెడ్డి



మల్యాలలో ఇస్రో గణపతి విగ్రహం

కథలాపూర్: మండలంలో వినాయకుని మండపాల వద్ద మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. చింతకుంటలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పూజలు చేశారు.

జగిత్యాలరూరల్: పొరండ్ల రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. సర్పంచ్ సంధ్యారాణి, నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలో ఆర్ఆర్ ఫ్యాన్స్ ప్రతిష్ఠించిన గణేశుని విగ్రహానికి మంగళవారం కుంకుమ పూజ నిర్వహించారు. సర్పంచ్ శ్రీనివాస్ భక్తులకు అన్నదానం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు నందిని, మహిళలు హాజరయ్యారు.

ఇబ్రహీంపట్నం: వేములకుర్తి గ్రామంలో ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద మంగళవారం కుంకుమ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సురేశ్, హరీశ్, సాయికుమార్, వెంకటేశ్, నరేందర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంతోపాటు, మండలంలోని 32 గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథుల వద్ద మంగళవారం యువజన సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. శ్రీనివాస్, రాంసురేశ్, శ్రీకాంత్, శేఖర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్: మండల కేంద్రంలోని కౌండిన్య యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేశునికి మంగళవారం 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. వీరా నాని యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుని వద్ద అన్నదానం చేశారు.

ఆకట్టుకుంటున్న ఇస్రో గణపయ్య

మల్యాల: మండల కేంద్రంలో త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇస్రో గణపయ్య విగ్రహం ఆకట్టుకుంటోంది. చంద్రయాన్–3 విజయవంతంపై అవగాహన కల్పించేందుకు ఈ విగ్రహాన్ని తయారు చేయించామని నిర్వాహకులు తెలిపారు.

ఈ–పంచాయతీ ఉద్యోగుల సమ్మె నోటీసు



పెగడపల్లి: నోటీసు ఇస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

మల్లాపూర్: ఈ–పంచాయతీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఈ–పంచాయతీ కంప్యూటర్‌ఆపరేటర్లు శ్రీధర్, అనిల నాగమణి కోరారు. మంగళవారం నుంచే నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మల్లాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జగదీశ్‌ను కలిసి సంబంధిత నోటీసు అందించారు. పంచాయతీరాజ్ టెక్నికల్ విభాగంలో 13 ఏళ్లుగా ప్రాజెక్టు మేనేజర్లు, ఈ–పంచాయతీ ఆపరేటర్లుగా విధులు నిర్వర్తిస్తున్న తమను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పే స్కేల్ అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ఆరోగ్యబీమా, భద్రత, ఉద్యోగుల్లో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబసభ్యులకు కారుణ్య నియామక అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇబ్రహీంపట్నం: తమ సమస్యలు పరిష్కరించాలని ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీవో ప్రభుకు సమ్మె నోటీసు అందజేశారు.

పెగడపల్లి: పంచాయత్‌రాజ్ శాఖ టెక్నికల్ వ్యవస్థలో పనిచేస్తున్న పాజెక్టు మేనేజర్లు, జీపీల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం ఎంపీడీవో పుల్లయ్యకు సమ్మె నోటీస్ అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న అన్ని వసతులు తమకు వర్తింపజేయాలని కోరారు. ప్రవీణ్‌రావు, సాయి, కిషోర్, మహేశ్ పాల్గొన్నారు.

16వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె



పెగడపల్లిలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు



మల్యాలలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

రాయికల్: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె మంగళవారం 16వ రోజుకు చేరింది. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తూ నిరసన తెలిపారు. ఇక్కడ అంగన్‌వాడీ కార్యకర్తలు రోజా, రమాదేవి, లావణ్య, పద్మ, ఉమాదేవి, రాజేశ్వరి, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీ సిబ్బంది పేర్కొన్నారు. అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం కొనసాగింది. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మంగళవారం మానవహారంగా ఏర్పడి, నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం వారు 16 రోజులుగా దీక్ష చేస్తున్నారు. ప్రభుత్వం దిగివచ్చి, తమ డిమాండ్లు నెరవేర్చేదాకా ఉద్యమిస్తామని తెలిపారు.

కనీస వేతనం అమలు చేయాలి



మల్లాపూర్‌లో నినాదాలు చేస్తున్న ఆశవర్కర్లు



రాయికల్‌లో నిరసన తెలుపుతున్న ఆశవర్కర్లు

మల్లాపూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశవర్కర్లు మంగళవారం నిరసన తెలిపారు. తమకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, రూ.18 వేలు జీతం, ఏటా రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లయ, శిరీష, సరిత, భూదేవి, ప్రేమలత, లావణ్య, స్వప్న, రమ, వసంత తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: తమకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశవర్కర్లు చేపడుతున్న సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మోకాళ్లపై కూర్చొని, నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అనిత, నీలిమ, రమ, విజయలక్ష్మి, కవిత, రజిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.